# పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్

- ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్, జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, బీఆర్ఎస్ ఖానాపూర్ అభ్యర్థి జాన్సన్ నాయక్

ఉట్నూర్,అక్టోబర్ 14 : ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించాలని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్, జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ అన్నారు. స్థానిక హెచ్‌కేజీఎన్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ సర్పంచ్‌లు, కార్యకర్తలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటింటా సంక్షేమ పథకాల లబ్ధిదారులు ఉన్నారని, వాటిని గుర్తుచేస్తూ ఆపదలో ఆదుకున్న పథకాలను గుర్తు చేయాలన్నారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. బీఆర్ఎస్ గెలుపు తథ్యమని అలాగే కష్టపడాల్సిన పని ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, వైస్ ఎంపీపీ బాలాజీ, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీరాం, కోఆప్షన్ సభ్యుడు రషీద్, మాజీ జడ్పీటీసీ జగ్జీవన్‌రావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు దాసండ్ల ప్రభాకర్, సుమన్‌బాయి, మర్సకోల తిరుపతి, సలీం, ఆశన్న, సింగానే భరత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మంత్రి వేములను పరామర్శించిన ఎమ్మెల్యే



ఎదులాపురం : మంజులమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న

ఎదులాపురం, అక్టోబర్14 : రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తల్లి మంజులమ్మ ఇటీవల మృతి చెందింది. దీంతో ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న శనివారం మంత్రి స్వగ్రామం వేల్పూర్‌కు వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంజులమ్మ చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు. అలాగే హరితహారంలో భాగంగా మొట్టమొదటి అటవీ శాఖ మంత్రిగా ఎమ్మెల్యే జోగు రామన్న, సీఎం కేసీఆర్‌తో కలిసి నాటిన మొక్క ఏపుగా పెరగగా మొక్క వద్ద ఫొటో దిగి జ్ఞాపకాన్ని పంచుకున్నారు. ఆయన వెంట డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

### ముథోల్ ఎమ్మెల్యే ..

భైంసా, అక్టోబర్, 14 : నిజామాబాద్ జిల్లా వేల్పూర్‌లోని మంత్రి నివాసంలో వేముల ప్రశాంత్‌రెడ్డిని ముథోల్ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి శనివారం పరామర్శించారు. అనంతరం మంజులమ్మ ఫొటో వద్ద శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు.

# బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయం



తాంసి : బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్‌ను కలిసిన తాంసి (బీ ) గ్రామ సర్పంచ్, మహిళా సంఘాలు

- బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్
- అడేగామ(బీ) గ్రామంలో పర్యటన

ఇచ్చోడ, అక్టోబర్ 14 : బడుగు బలహీన వర్గాల అభివృద్ధే బీఆర్ఎస్ ధ్యేయమని బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని అడేగామ(బీ) గ్రామంలో శనివారం పర్యటించారు. ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. అనంతరం జల్దా గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలతో నిరుపేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు.

### మల్లికార్జున స్వామికి పూజలు..

మండలంలోని సిరిచెల్మ గ్రామంలోని శ్రీ మల్లికార్జునస్వామి ఆలయంలో స్వామివారికి బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు భక్తి మార్గంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, ఎంపీపీ నిమ్మల ప్రీతం రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పాండురంగ్, మండల మాజీ కన్వీనర్ మేరాజ్, సర్పంచ్ సునీత సుభాష్, మాజీ జడ్పీటీసీ కృష్ణకుమార్, ఉప సర్పంచ్ శిరీష్ రెడ్డి, ఏపీసీఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, ఎంపీటీసీలు శివ రెడ్డి, గాడ్గె సుభాష్, అబ్దుల్ శాబీర్, రమేశ్, విజయ్, లక్ష్మి, పాండు, మహేందర్ రెడ్డి, అజీమ్, ఫరీద్, మతీన్, మైముద్, రవీందర్, సుభాష్, గణేశ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ హ్యాట్రిక్ ఖాయం

తాంసి, అక్టోబర్ 14 : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని, కేసీఆర్ మూడోసారి సీఎంగా గెలిచి రికార్డు సృష్టిస్తారని బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని తాంసి (బీ) గ్రామానికి చెందిన సర్పంచ్, మహిళా సంఘాల సభ్యులు శనివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనిల్ జాదవ్ మాట్లాడుతూ కేసీఆర్ అంటే ప్రజలకు నమ్మకం, విశ్వాసం ఉందని, అందుకే మరోసారి భారీ మెజార్టీతో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వప్నరత్న ప్రకాశ్, రజినీకాంత్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, ఆశన్న, మహిళా సంఘాలు పాల్గొన్నారు.

# గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి



మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి పూలమొక్క అందజేస్తున్న దిలావర్‌పూర్ మండలబీఆర్ఎస్ నాయకులు

- దిలావర్‌పూర్ మండల నాయకులతో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

దిలావర్‌పూర్, అక్టోబర్ 14 : అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా కలిసికట్టుకుగా ముందుకు సాగాలని రాష్ట్ర దేవాదాయ, న్యాయ అటవీ శాఖ మంత్రి, నిర్మల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఇంద్రకరణ్‌రెడ్డి సూచించారు. దిలావర్‌పూర్ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కొమ్ముల దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అదే గ్రామానికి చెందిన పలువురు మైనార్టీ నాయకులు ఆయనను శనివారం కలిశారు. గ్రామంలో మైనార్టీ ఓటర్లు, పలు విషయాలను దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నేతృత్వంలోని చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసేలా చూడాలన్నారు. 50 రోజులు కష్టపడి పనిచేస్తే వచ్చే ఐదేళ్లు మరిన్ని అభివృద్ధి పనులు చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పా రు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్దే అనిల్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అన్వర్ ఖాన్, మైనార్టీ నాయకులు ఉన్నారు.

# ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలి



నిర్మల్ టౌన్: సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్



ఎదులాపురం : సమావేశంలో మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్

- నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అధికారులతో సమీక్ష

నిర్మల్ టౌన్, అక్టోబర్ 14 : ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వర్తించాలని నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమీకృత భవనంలో నోడల్, ఎన్నికల అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ, బాధ్యతలు, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఓటరు అవగాహన ర్యాలీ, పోలింగ్ బూత్‌ల నంబరర్లు, ఎన్నికల నియామవళి, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలన్నారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కలెక్టరేట్‌లో టోల్‌ఫ్రీ నంబరు 1950ని ప్రారంభించామని , 24 గంటల పాటు అందుబాటులో ఉంటుందని చెప్పారు. చెక్‌పోస్టుల వద్ద మద్యం, నగదు రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎన్నికల కంట్రోల్ కార్యాలయంలో పని చేసే సిబ్బంది సమయపాలన పాటించి అన్ని వివరాలను ఎప్పటికప్పుడు ప్రజలు, అధికారులకు అందజేయాలని ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవోలు రత్నకల్యాణి, జీవకరణ్, కోమల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### ముందస్తు అనుమతి తీసుకోవాలి

ఎదులాపురం,అక్టోబర్ 14 : ప్రచార సామగ్రి, ఫ్లెక్సీల ముద్రణకు ముందస్తు అనుమతి తీసుకోవాలని ఆదిలాబాద్ జిల్లా ఎన్నికల అధికారి , కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఫ్లెక్సీ, ప్రింటింగ్ ప్రెస్ ప్రతినిధులతో వేర్వేరుగా సమావేశ మందిరంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభ్యర్థులు ప్రింటింగ్ చేయించే కరపత్రాలు , గోడప్రతులు, ఫ్లెక్సీలు, ఇతర ప్రచార సామగ్రికి జిల్లా ఎన్నికల అధికారి అనుమతి పొందాలని, లేకుండా ముద్రిస్తే నిబంధనల మేరకు చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రచురణలపై ప్రింటింగ్ ప్రెస్ పేరు , చిరునామా , సెల్ నంబర్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అభ్యర్థుల ప్రచారం కోసం గోడలపై రాతలు, పోస్టర్లు, బ్యానర్లు వంటి వాటికి , సభలు, సమావేశాలు, వాహన ర్యాలీలకు సంబంధిత రిటర్నింగ్ అధికారుల అనుమతులు తప్పనిసరిగా పొందాలన్నారు. అలాగే దినపత్రికలు, వివిధ న్యూస్ చానల్స్, సోషల్ మీడియాలో ప్రకటనలకు మీడియా సర్టిఫికేషన్ ,మానిటరింగ్ కమిటీ ద్వారా అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉపయోగించే వివిధ వస్తువులు, సామగ్రి రేట్లను రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించి నిర్ణయించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మోహాతో, ఫ్లెక్సీ ,ప్రింటింగ్ ప్రెస్ ,రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు ఉన్నారు.